www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 25 అక్టోబర్ 2025

5

ఏలూరు



చదువుతో పాటు ఆటల్లోనూ సత్తా

బాలికల పాఠశాల ప్రిన్సిపల్ కె.లక్ష్మీ కుమారి



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

ముసునూరు: తమ విద్యార్థులు చదువులోనే కాకుండా ఆటల్లో కూడా మంచి ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో విజయం సాధించారని గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ కె.లక్ష్మీ కుమారి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ముసునూరు గురుకుల బాలికల పాఠశాలలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం జిల్లా స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో యోగ పోటీలు నిర్వహించగా జిల్లా స్థాయిలో తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయికి ఎంపిక అవుతున్నట్లు తెలియజేశారు. అలాగే ఆ విద్యార్థులను అభినందించారు.

ఉపాధి చూపరు.. భృతి ఇవ్వరు..!

నిరుద్యోగుల పరిస్థితి అగమ్యగోచరం

జిల్లా ఉపాధి కార్యాలయంలో 45,397 మంది నమోదు

నమోదు చేసుకోనివారి సంఖ్య వేలల్లోనే

వర్క్‌ఫ్రం హోమ్ కల్పిస్తామని చేసిన సర్వే ఏమైందో..?

నెలకు రూ.మూడు వేలు నిరుద్యోగ భృతిపై చర్చ




ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగులను అన్నివిధాలా ఆదుకుంటామని కూటమి ఎన్నికల్లో నమ్మబలికింది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ఇప్పటి వరకూ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఏమాత్రం కల్పించని పరిస్థితి నెలకొంది. ఉద్యోగాలు కల్పించకపోతే నెలకు రూ.మూడు వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ సైతం అమలు కాలేదు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో గత వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దీంతో 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు హామీల వర్షం కురిపించింది. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, అప్పటి వరకూ నిరుద్యోగ భృతి అందిస్తామని మేనిఫెస్టోలో సైతం పెట్టింది. ఇప్పటి వరకూ ఒక్క అడుగూ ముందుకు పడిన పరిస్థితి లేదు. ఏలూరు జిల్లా ఉపాధి కార్యాలయంలో 2025 సెప్టెంబర్ నాటికి 45,397 మంది నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఇందులో 31,280 మంది పురుషులు ఉండగా, 14,117 మంది మహిళలు ఉన్నారు. ఉపాధి కార్యాలయంలో నమోదు చేసుకోని వారి సంఖ్య వేలల్లోనే ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ నిర్వహించిన జాబ్‌మేళాల్లో 930 మంది ప్రయివేటు సంస్థలకు ఎంపికైనట్లు ఉపాధి కార్యాలయ లెక్కలు చెబుతున్నాయి. ఏడాదిన్నర గడిచినా పట్టుమని వెయ్యి మందికి కూడా ఉద్యోగాలు కల్పించని పరిస్థితి ఉంది. జిల్లాలో కొత్తగా వచ్చిన పరిశ్రమలుసైతం పెద్దగా లేకుండాపోయాయి. దీంతో నిరుద్యోగుల పరిస్థితి అయోమయంగా మారింది. ఉద్యోగాలు కల్పించే వరకూ నిరుద్యోగులకు నెలకు రూ.మూడు వేల చొప్పున భృతి అందిస్తామని కూటమి సర్కార్ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచింది. ఇప్పటి వరకూ దీనిపై ఒక్క అడుగూ ముందుకు పడిన దాఖలాల్లేవు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని నిరుద్యోగుల్లో తీవ్రమైన చర్చ సాగుతోంది. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వం నిరుద్యోగులకు నెలకు రూ.రెండు వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చింది. ఐదేళ్లపాటు అమలు చేయకుండా ఎన్నికలకు మూడు నెలల ముందు నిరుద్యోగ భృతి పేరుతో హడావుడి చేసింది. యువతలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం కావడంతో 2019 ఎన్నికల్లో టిడిపి ఘోర పరాజయం పాలైంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 అసెంబ్లీ స్థానాలకు కేవలం రెండుచోట్ల మాత్రమే గెలిచింది. నరసాపురం, ఏలూరు ఎంపీ స్థానాల్లో ఒక్కటి కూడా గెలవలేకపోయింది. నిరుద్యోగ భృతి ఈసారీ సక్రమంగా అమలు చేయపోతే కూటమి సర్కార్ అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని చెప్పొచ్చు.

వర్క్‌ఫ్రం హోమ్ సర్వే ఏమైనట్టు..?

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయ ఉద్యోగులతో ప్రభుత్వం వివిధ రకాల సర్వేలు చేయించింది. అందులో నిరుద్యోగులకు సంబంధించిన సర్వే అత్యంత ముఖ్యమైనదని చెప్పొచ్చు. ఇంటి వద్దనే ఉంటూ వర్క్‌ఫ్రం హోమ్ చేయాలనుకునే వారి డేటాను సచివాలయ ఉద్యోగులు సేకరించారు. వర్క్‌ఫ్రం హోమ్ కోసం ముందుకొచ్చిన నిరుద్యోగుల నుంచి సర్టిఫికెట్లు సైతం తీసుకుని అప్‌లోడ్ చేశారు. ఇప్పటి వరకూ అందుకు సంబంధించిన ఎటువంటి సమాచారమూ అభ్యర్థులకు లేకుండా పోయింది. సచివాలయ ఉద్యోగుల వద్దకు వెళ్తే తమకు ఏమీ తెలియదని, సర్వే చేసి, సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయడం వరకు మాత్రమే తమ పని అని చెబుతున్నారు. వర్క్ ఫ్రం హోమ్ పేరుతో చేసిన సర్వే ఏమైందో ఏఒక్కరూ సమాధానం చెప్పడం లేదు. దీంతో వర్క్‌ఫ్రం హోమ్ కోసం ముందుకొచ్చిన ఎంతోమంది మహిళా నిరుద్యోగులు తీవ్ర నిరాశలో కూరుకుపోతున్నారు. ప్రభుత్వం నుంచి మాత్రం సరైన స్పందన లేకుండాపోయింది. దీంతో నిరుద్యోగ యువతలో ప్రభుత్వంపై తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది.

గుణ్ణం బుల్లెబ్బాయికి 'ఎడు ఐకాన్-2025' పురస్కారం



పురస్కారం అందుకుంటున్న బుల్లెబ్బాయి

ప్రజాశక్తి - ఉంగుటూరు

విద్యారంగంలో విశేష కృషి చేసి, విద్యార్థుల భవిష్యత్‌ను రూపుదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్న నారాయణపురం ఉషోదయ హైస్కూల్ కరస్పాండెంట్ గుణ్ణం బుల్లెబ్బాయికి ప్రతిష్ఠాత్మకమైన 'ఎడు ఐకాన్-2025' అవార్డు లభించింది. దేశవ్యాప్తంగా విద్యారంగంలో విశిష్టమైన సేవలందిస్తున్న వ్యక్తులను గుర్తించి, ప్రోత్సహించేందుకు స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్, నిషా అప్పస్వా ట్రస్టుతో కలిసి మల్ల బ్యూరో ఆఫ్ చైల్డ్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సంస్థ ఈ అవార్డును అందజేస్తుంది. ఈ అవార్డు ప్రదాన కార్యక్రమం ఈ నెల 23న విశాఖపట్నం హోటల్ ఫెయిర్ ఫీల్డ్ మ్యారియట్‌లో ఘనంగా జరిగింది. విశాఖపట్నం ఎంపీ భరత్, నిషా అధ్యక్షులు కులభూషణ్ శర్మ, అప్పస్వా చీఫ్ మెంటర్ కృష్ణారెడ్డి, మల్ల బ్యూరో అధ్యక్షులు మల్ల రామునాయుడు, మల్లు శ్రీవాణి చేతుల మీదుగా బుల్లెబ్బాయి అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా అవార్డుగ్రహీతను పలువురు మిత్రులు, శ్రేయోభిలాషులు అభినందించారు. విద్యారంగంలో ఇలాంటి ప్రతిభావంతులు గుర్తింపు పొందడం గర్వకారణమని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పిఎఫ్ రుణాల ఫైనల్ పేమెంట్ జాప్యాన్ని నివారించాలి

యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యాన వినతి



అధికారికి వినతిని అందజేస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయుల పిఎఫ్ రుణాల ఫైనల్ పేమెంట్‌లకు సంబంధించిన జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని కోరుతూ యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యాన శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్తు ముఖ్యకారణ నిర్వహణ అధికారి ఎం.శ్రీహరిని కలిసి విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఉపాధ్యాయుల ఫైనల్ పేమెంట్లు, రుణాలు మంజూరు చేయడంలో తీవ్రమైన జాప్యం జరుగుతుందని, మెడికల్ చికిత్స కోసం దరఖాస్తు చేసినటువంటి రుణాలు విషయంలో గతం కంటే భిన్నంగా వ్యాధికి సంబంధించి ఎంత ఖర్చవుతుందో డాక్టర్ తో అమౌంట్ రాయించాలని ఆరోపించారు. సంబంధిత వ్యాధికి సంబంధించిన ల్యాబ్ రిపోర్ట్లు జత చేయాలని, అలా జతచేయని అప్లికేషన్లు తిరిగి పంపించడం జరుగుతుందని, ఈవిధంగా రాష్ట్రంలోని ఏ ఇతర జిల్లాలో లేనటువంటి నిబంధనలు విధించి ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అటువంటి నిబంధనలు ఏమైనా ఉంటే ఒక సర్కులర్ రూపంలో విడుదల చేయాలని కోరారు. స్పందించిన జిల్లా పరిషత్తు సిఇఒ శ్రీహరి సమస్యలు వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. యుటిఎఫ్ జిల్లా కోశాధికారి జివి.రంగమోహన్, జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు పాల్గొన్నారు.

వీడని వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం

కాల్వలను తలపించిన రహదారులు

నేలకొరిగిన వరి పంట

పనుల్లేక కూలీల పస్తులు



కలిదిండి-కైకలూరు మార్గంలో కొట్టుకుపోయిన రోడ్డు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నగరంలో శుక్రవారం ఉదయం నుంచి నిరంతరాయంగా వర్షం కురుస్తూనే ఉంది. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోజంతా చినుకులు పడుతూనే ఉండటంతో ముఖ్యంగా పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యమైన పనులు ఉన్నవారు తప్ప మిగిలినవారు రోడ్లపైకి రాకపోవడంతో దుకాణాలన్నీ వెలవెలబోతున్నాయి. ముఖ్యంగా రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు బేరాలు లేక తీవ్రంగా నష్టపోయారు. మరోపక్క నగరంలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడంతో ఆ ప్రాంతాల్లో తీవ్ర దుర్గంధం ఏర్పడి రోడ్లపై వెళ్లేవారు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. నగరంలో భారీ వర్షం కురవకపోయినప్పటికీ చినుకులు పడుతూనే ఉండటంతో నగరమంతా చిత్తడి చిత్తడిగా మారింది.

జీలుగుమిల్లి: అల్పపీడన ప్రభావంతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. మండలంలో పలుచోట్ల వేసిన పొగాకు నారుమడుల్లోకి నీళ్లు చేరాయి. వరద ప్రవాహానికి బర్రింకలపాడు సమీపంలో వరి పొలాలు దెబ్బతిన్నాయి. మరికొన్ని చోట్ల పొట్ట మీద ఉన్న వరి చేలు నేలకొరగడంతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వంకావారిగూడెం సమీపంలో ఉన్న వాగుపై రాకపోకలకు ఇటీవల తూరలు ఏర్పాటు చేయగా వరద ప్రవాహానికి మళ్లీ గండి పడింది.

కలిదిండి-కైకలూరు మధ్య రాకపోకలు బంద్

కలిదిండి: కలిదిండి, కైకలూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక లాల్వా డ్రెయిన్‌పై రోడ్డు పూర్తిగా కుంగిపోయి నీటి ఒరవడికి కొట్టుకుపోయింది. పక్క గ్రామాల నుండి ప్రధాన సెంటర్‌కు వచ్చిన వారు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉండిపోయారు. కనీసం నడిచి వెళ్లే మార్గం కూడా లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. రాకపోకలకు ఆటంకం లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



జీలుగుమిల్లి: వంకావారిగూడెం వాగు వద్ద కొట్టుకుపోయిన కల్వర్టు

ముదినేపల్లి: మండలంలో శుక్రవారం కూడా వర్షం కొనసాగింది. తీవ్ర అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షంతో మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం 10 గంటలకు మొదలైన భారీ వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది. దీంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. జనం ఇంటి నుండి కాలు బయట పెట్టే పరిస్థితి లేదు. మండలంలోని అన్ని గ్రామాల్లో డ్రెయినేజీలు పొంగడంతో నీరంతా రోడ్లపైకి చేరి కదలడం లేదు. భారీ వర్షంతో గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, ఆర్అండ్‌బి రహదారులు కాలువలను తలపించాయి. రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు కాలనీల్లోని నివాసాల చుట్టూ వరద నీరొచ్చి చేరడంతో కాలనీవాసులు ఇంటి నుండి బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. ముదినేపల్లి-గుడ్లవల్లేరు రోడ్డులో ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద రోడ్డుపై భారీ గోతులు ఏర్పడ్డాయి. పలుచోట్ల ఇళ్లలోకి నీరు చేరడంతో పాములు, విషపురుగులు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని జనం గగ్గోలు పెడుతున్నారు. ఎడతెరిపిలేని వాన కారణంగా వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, ఇతర రంగానికి చెందిన కార్మికులకు పనులు లేకుండాపోయాయి. వైవాక-కొచ్చర్ల రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డుపై మోకాళ్ల లోతు నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు నానావస్థలు పడ్డారు.



పెనుమాకలంక రోడ్డుపైకి చేరిన వరద నీరు

కొల్లేరుకు వరద

పెనుమాకలంక రహదారిపైకి నీరు

ప్రజాశక్తి - మండవల్లి

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు కొల్లేరులోకి వరద నీరు పెద్దఎత్తున వచ్చి చేరుతోంది. నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొల్లేరుకు వరద నీరు పోటెత్తుతోంది. దీంతో పెద్దడ్లగాడి-పెనుమాకలంక రహదారిపై నుండి రెండు చోట్ల నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆ రహదారిపై రాకపోకలను నిలుపుదల చేశారు. వరద నీటి ప్రవాహానికి పెద్దఎడ్లగాడి వంతెన వద్ద మేట వేసిన తూడు, గుర్రపు డెక్క అడ్డుపడడంతో వరద నీరు దిగువకు వెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో కొల్లేరు పరివాహక గ్రామాలైన పెనుమాకలంక, నందిగామ లంక, శ్రీరామనగర్, ఇంగిలం పాక లంక, తక్కెళ్లపాడు, నిచ్చుమిల్లి, పులపర్రు, పిల్లిపాడు ముంపు బారిన పడే ప్రమాదం ఉందని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని సమాచారం ఉండటంతో లంక గ్రామాలు గజగజ వణికిపోతున్నాయి. 2024 సెప్టెంబర్ తరహాలో వరద ముంచెత్తుతుందేమోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వరద నీటి ప్రవాహానికి అడ్డుపడుతున్న తూడు, గుర్రపు డెక్కను యుద్ధ ప్రాతిపదికన తొలగించి కొల్లేరు పరివాహక ప్రాంత గ్రామాలను కాపాడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ముంపులో పంట పొలాలు

ఏలూరు జిల్లాలో 1987, పశ్చిమలో 2,988 ఎకరాల్లో మునకలో పంట

దిక్కుతోచని స్థితిలో 3,078 మంది రైతులు

ఎడతెరిపిలేని వర్షంతో వరిసాగుపై తీవ్ర ప్రభావం



ఏలూరు అర్బన్: వర్షంలోనే స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గడిచిన మూడు రోజులుగా అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు రెండు జిల్లాల్లోనూ పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. ముఖ్యంగా వరిసాగుపై వర్షాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వర్షాలకు ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో 1,102 మంది రైతులకు చెందిన 1987 ఎకరాలు, పశ్చిమలో 1976 మంది రైతులకు సంబంధించిన 2,988 ఎకరాలు ముంపుబారిన పడినట్లు రెండు జిల్లాల వ్యవసాయాధికారులు తెలిపారు. వర్షాలకు ఏలూరు జిల్లాలో కైకలూరు, పోలవరం, కలిదిండి, ఏలూరు, లింగపాలెం, భీమడోలు, ముదినేపల్లి, పెదపాడు, కామవరపుకోట మండలాల్లోని 31 గ్రామాల పరిధిలో మొత్తం 69,891 ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా, వర్షాలకు 1,987 ఎకరాల్లో ముంపునకు గురైంది. పశ్చిమలో ఆకివీడు, ఉండి, కాళ్ల, ఇరగవరం, నరసాపురం మొగల్తూరు, యలమంచిలి మండలాల్లోని 44 గ్రామాల పరిధిలో 2,988 ఎకరాలు పంట నీట మునిగినట్లు ప్రాథమిక అంచనాల్లో అధికారులు తేల్చారు. ముంపుకు గురైన పంటంతా పొట్ట, ఈనికదశల్లో ఉంది. రైతులు ఇప్పటికే ఎకరాకు రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. పంట చేతికొచ్చే సమయంలో వర్షాలకు పంట ముంపునకు గురవ్వడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వర్షాలు మరో రెండు రోజులు ఉంటే పంటనష్టం మరింత పెరిగే ప్రమాదం పొంచి ఉంది. పంట కాలువలు పూడిపోవడంతో పొలాల్లో నీరు దిగువకు వెళ్లని పరిస్థితి నెలకొంది. ఎక్కువ రోజులు పొలాల్లో వర్షపునీరు నిల్వ ఉంటే పంట కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చివరిదశలో కురుస్తున్న వర్షాలతో రైతులు తీవ్ర నష్టాలబారిన పడే పరిస్థితి ఏర్పడింది.

ప్రతిఒక్కరూ ఫ్రైడే డ్రైడే పాటించాలి

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శోభ



పాండురంగపురంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

దోమల వృద్ధిని అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ ఫ్రైడే డ్రైడే పరిసరాల పరిశుభ్రత ఆచరించాలని అప్పుడే దోమల ద్వారా సంక్రమించే ప్రాణాంతక వ్యాధుల నుండి కొంత వరకు తప్పించుకోవచ్చునని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శోభ సూచించారు. స్థానిక ఏలూరు పవర్ పేట పట్టణ ఆరోగ్య కేంద్రం గన్‌బజార్-1 సచివాలయం పరిధిలోని పాండురంగపురంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడ ప్రజలతో మాట్లాడుతూ అపరిశుభ్ర పరిసరాల వల్ల దోమలు ఎక్కువగా వృద్ధి చెంది తద్వారా ప్రాణాంతక వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్‌గునియా మొదలగు వ్యాధులు సంభవించే అవకాశం ఉందన్నారు. దోమకాటు కంటికి కనిపించదని కానీ దాని ద్వారా ముప్పు చాలా ఉందని, కాబట్టి ప్రజలు దోమల నిర్మూలనలో భాగస్వామి కావాలని సూచించారు. అప్పుడే దోమల ద్వారా వచ్చే వ్యాధులు అరికట్టుకోవచ్చన్నారు. మనకు ఎక్కువగా హాని చేసే దోమలు నీళ్ల తొట్టుల్లోను, కొబ్బరి బొండాలు, టైర్లు, పూల కుండీలు, రుబ్బురోలు, ఫ్రిడ్జ్ బాక్స్, వర్షం నీరు నిలువ ప్రాంతాలు, మొదలకు స్థలాల్లో వృద్ధి చెందుతాయి కాబట్టి వారానికి ఒకసారి శుభ్రపరచుకొని మూతలు పెట్టుకోవాలని సూచించారు. నీటి నిల్వ ప్రాంతాలలో ఇంజిన్ ఆయిల్ చల్లాలని, సాయంత్రం సమయంలో కిటికీలు వేసుకోవాలని, దోమతెరలు వాడాలని, వేపాకు పొగ వేసుకోవాలని సూచించారు. ప్రజలు మురికి కాలువలో చెత్త వేయరాదని, మనకి ఎక్కువగా హాని చేసే దోమలు మంచినీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయి కాబట్టి వారానికి ఒకసారి కడిగి ఆరబెట్టి మూతలు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ జ్యోతి, పవర్ పేట యుపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ గౌతమ్, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ ఝాన్సీ, హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పి-4 : ఎంఎల్‌ఎ



ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పి-4 పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని చింతలపూడి నియోజకవర్గం ఎంఎల్‌ఎ సొంగా రోషన్ కుమార్ తెలిపారు. లింగపాలెం మండలంలో సొంగా రోషన్ కుమార్ ఆధ్వర్యాన నియోజకవర్గ స్థాయిలో రెండవ ధర్మాజీగూడెంలో పి-4 కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2029 పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాల్లో నీళ్లు.. రైతు కంట కన్నీళ్లు..!



ముదినేపల్లి: చాపలా నేలనంటిన వరి పంట


ఎడతెరిపి లేని వర్షాలతో వరి రైతులు లబోదిబో

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరి పొలాల్లోకి నీరు చేరి రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లోకి నడుము లోతు వర్షపు నీరు చేరడంతో పలుచోట్ల వరిపైరు నేల వాలింది. చినపాలపర్రు సమీపంలో 1061 రకం చేను నేలనంటింది. దీంతో వరి కంకులు నీటిలో నాని కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. ముదినేపల్లి, చినపాలపర్రు, వడాలి, గురజ, పెయ్యేరు, దాకరం తదితర గ్రామాల్లో పంట పొలాల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది. చేల్లో ముంపు నీటిని బయటకు తోడుకునేందుకూ అవకాశం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మేజర్, మైనర్, మీడియం డ్రెయిన్లు అన్ని ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటితో పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో పంట చేతికొస్తుందో, లేదో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరి పైరు ఈనిక, పొట్ట దశలో ఉందని, ఈ సమయంలో భారీ వర్షాల కారణంగా మానుకాయ వచ్చి పంట దిగుబడులు తగ్గిపోయే అవకాశం ఉందంటున్నారు. భారీ వర్షం కారణంగా డ్రెయిన్లు ఎదురు తన్నడంతో ఆ నీరు తూములు ద్వారా పొలాల్లోకి చేరుతోంది. పోల్‌రాజు, చిన్న కొమ్ములేరు తదితర డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూడు, పూడిక తీయించి వరి పొలాల్లో నీరు బయటకు వెళ్లేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అదేవిధంగా నాలుగు రోజులపాటు పంట కాలవలను అధికారులు కట్టివేస్తే పొల్లాల్లోని ముంపు నీరు మురుగు కాలువల్లోకి దిగే అవకాశం ఉందన్నారు.

రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి: ఎఒ

మండలంలోని రైతులంతా వరి పంటను కాపాడుకునేందుకు తగు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పొలాల్లో అధికముగా ఉన్న ముంపు నీటిని పొలాల్లో నిల్వ లేకుండా చిన్న కాలువల ద్వారా బయటకు పంపాలన్నారు. అధిక వర్షాలు తగ్గేవరకు రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.



జీలుగుమిల్లి: నీట మునిగిన పంట

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలివ్వాలి

వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి


ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గిరిజన, గిరిజనేతర పేద రైతులకు తక్షణమే అన్ని బ్యాంకులు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలివ్వాలని, భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం మండల విస్తృత సమావేశం మండల ఉపాధ్యక్షులు గుడెల్లి రామారావు అధ్యక్షతన నిర్వహించారు. మండలంలోని రైతాంగ సమస్యలు చర్చించి పలు తీర్మానాలు చేశారు. ముఖ్యఅతిథి శ్రీనివాస్ మాట్లాడుతూ గిరిజనులు, గిరిజనేతర పేదలు సాగులో ఉన్న డి.ఫారం పట్టా భూములకు బ్యాంకులు పంట రుణాలు మంజూరు చేయకపోవడం అన్యాయమన్నారు. పేదల సాగులో ఉన్న భూములకు పంట రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల ప్రకారం ప్రతి రైతుకూ రూ.2 లక్షల వరకు సొంత ధ్రువీకరణ పత్రం ఆధారంగా పంట రుణాలు మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. రిజర్వ్ బ్యాంకు ఆదేశాలకు భిన్నంగా బ్యాంకర్లు వ్యవహరించడం తగదన్నారు. పేద రైతులకు పంట రుణాలివ్వకపోతే ఆయా గ్రామాల సర్వీసు బ్యాంకులను ముట్టడిస్తామని హెచ్చరించారు. భారీ వర్షాల వల్ల జిల్లాలో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పత్తి కొనుగోలుకు సిసిఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. లో గ్రేడ్ వర్జీనియాకు కనీస మద్దతు ధర కల్పించాలని కోరారు. ఈ నెల 30, 31 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సంఘం నేతలు బొడ్డు రాంబాబు, సిరిబత్తుల సీతారామయ్య, ప్రజాసంఘాల నేతలు చిట్టిబొమ్మ కొండలరావు, కారం నాగదుర్గ మాట్లాడుతూ రైతాంగ సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం తగదన్నారు. సమావేశంలో తాళ్లూరి సూర్యారావు, పాముల పాపారావు, సుంకవల్లి శేషగిరిరావు, దేవా రాజమ్మ, గంగుల రమణ, యలమాటి నరసింహారావు, బొంతు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితురాలికి సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి


నరసమ్మకు నగదు అందజేస్తున్న వినోద్

ముదినేపల్లిలోని మసీదు ప్రాంతానికి చెందిన మడ్డి నర్సమ్మ ఇల్లు బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ అగ్నిప్రమాదంలో రూ.4 లక్షల మేర ఆస్తి నష్టం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న నియోజకవర్గ టిడిపి కో-కన్వీనర్ కొడాలి వినోద్ శుక్రవారం నరసమ్మ ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు. అనంతరం ఆమెకు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌డీ షరీఫ్, దండుబోయిన నాని, తంటేపూడి చార్లీ, మొహ్మద్ రియాజ్, దుంపల కృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ దుర్మార్గం

మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు

పోలవరం : రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను ప్రయివేటుపరం చేయడం దుర్మార్గమైన చర్యని మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. శుక్రవారం మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చెయ్యొద్దంటూ మండలంలోని ఎల్అండ్‌డి పేట గ్రామంలో వైసిపి మండల అధ్యక్షులు బుగ్గ మురళీకృష్ణ, ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, జెడ్‌పిటిసి కలుం హేమ కుమారిలతో కలిసి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా తెల్లం బాలరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 17 మెడికల్ కాలేజీలను తీసుకువస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని ప్రయివేటీకరణ చేసేందుకు కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రయివేటీకరణ ప్రతిపాదన విరమించుకోకపోతే వైసిపి తరపున పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆనాడు మహనేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ పెడితే నేడు అనారోగ్యశ్రీగా మార్చేసారని మండిపడ్డారు. ప్రయివేటు ఆసుపత్రులకు బకాయిలు చెల్లించకుండా పేదలకు వైద్యం అందకుండా దూరం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రయివేటీకరణ పేరుతో ప్రజలను ప్రయివేటు ఆసుపత్రులకు బలిచ్చే కార్యక్రమం వెంటనే ఆపాలని, విద్యా వైద్యం రంగాలను ప్రయివేటు యాజమాన్యాల కిందకు తీసుకువెళ్లి విద్యార్థుల, పేదల జీవితాలలో చెలగాటం ఆడేందుకు సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని ప్రజా పోరాటాలతో అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ ఫాతిమా మునిషా, ఇళ్ల కళ్యాణ్, పొడుం శ్యామ్, కొరసిక శ్రీను, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా

కొయ్యలగూడెం : పోలవరం నియోజకవర్గానికి చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ప్రోత్సాహంతో కొయ్యలగూడెం ప్రకాశం డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో శుక్రవారం మెగా జాబ్ మేళా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నలుమూలల నుండి వందలాది మంది నిరుద్యోగులు పాల్గొని వివిధ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ యువత తమ ప్రతిభను ప్రదర్శించుకునేందుకు, ఉపాధి అవకాశాలను పొందేందుకు ఈ జాబ్ మేళాలు ఒక ముఖ్య వేదికన్నారు. కూటమి ప్రభుత్వం యువత భవిష్యత్తు కోసం అన్ని విధాలా కృషి చేస్తోందని తెలిపారు. ప్రతి నిరుద్యోగి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైకర్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శులు గడ్డమనగు రవికుమార్, కరాటం సాయి, గ్రీన్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పాదం కృష్ణ, జిల్లా సంయుక్త కార్యదర్శి మద్దు తేజ, జనసేన మండల అధ్యక్షులు తోట రవి పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో ప్రోత్సహించడం అభినందనీయం

గ్రామ ప్రముఖులు సిహెచ్.విక్టర్‌బాబు

ఆగిరిపల్లి : ఎల్ఆర్‌డి స్పోర్ట్స్ అండ్ డిఫెన్స్ అకాడమీ ద్వారా యువతను క్రీడల్లో ప్రోత్సహించడమే కాకుండా వారిని రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు అర్హత సాధించేలా కృషి చేయడం ఎంతో అభినందనీయమని ఆగిరిపల్లి గ్రామ ప్రముఖులు సిహెచ్.విక్టర్‌బాబు అన్నారు. స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన ఉమ్మడి కృష్ణాజిల్లా అండర్-17, అండర్-19 విభాగాల్లో నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో ఎల్ఆర్‌డి స్పోర్ట్స్ అండ్ డిఫెన్స్ అకాడమీకి చెందిన బలే సతీష్, పంద్రంకి స్వాంతన్ కుమార్, బి.హనుమా నాయక్, ఎస్.మాధవరావు, వి.భాను ప్రకాష్‌లు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఎల్ఆర్‌డి స్పోర్ట్స్ అండ్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ ఎల్.రామదాసును, రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన యువతను టిడిపి నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త ఎం.గోపాలరావు, ఎంఆర్‌పిఎస్ కన్వీనర్ కె.ప్రదీప్, బి.రాము, బి.కరుణాకర్ అభినందించారు.

ఘనంగా అంతర్జాతీయ గ్రంథాలయ దినోత్సవం

ఏలూరు సిటీ : అంతర్జాతీయ గ్రంథాలయ దినోత్సవంను జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం గురించి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్ బాబు వివరించారు. అంతర్జాతీయ గ్రంథాలయ దినోత్సవం అనగా అంకిత భావంతో పనిచేస్తున్న గ్రంథాలయాలను మనం గౌరవించుకోవడం అని కార్యదర్శి తెలిపారు. అలాగే చదువరులకు, విద్యార్థులకి, ఉద్యోగస్తులకి కావలసిన సమాచారంను వెంటనే అందించడం, పాఠకులకు కావలసిన వసతిని కల్పించడంలో ముందుండే జిల్లా కేంద్ర గ్రంథాలయంను కూడా మనం గౌరవించుకోవడం ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్ బాబు, గ్రంథాలయ సిబ్బంది విటి.సందీప్ కుమార్, బి.రమేష్, వైవి.సాయిబాబు, పాఠకులు పాల్గొన్నారు.

'పంచాయతీలో అవకతవకలపై విచారించాలి'

ముసునూరు : చింతలవల్లి గ్రామపంచాయతీ పరిధిలో చాలా అవకతవకలు జరిగాయంటూ వాటిపై విచారణ జరపాలని చింతలవల్లి గ్రామ టిడిపి అధ్యక్షులు కాటేపల్లి నాని మండల స్థాయి అధికారులను కోరారు. శుక్రవారం మండలంలోని చింతలవల్లి గ్రామ సచివాలయంలో గ్రామస్తులు, టిడిపి నాయకుల ఆధ్వర్యాన కొంతమేర నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాటేపల్లి నాని మాట్లాడుతూ చింతలవల్లి గ్రామపంచాయతీ పరిధిలో గత నాలుగు సంవత్సరాల నుండి పంచాయతీ వ్యవహారంలో రికార్డులపరంగా అవకతవకలు జరిగాయని, గ్రామస్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. గ్రామస్థాయిలో పనులు చేయకుండా ఆయా నిధులు పంచాయతీ అధికారులు, సర్పంచి ఇరువురు కలిసి దోచుకున్నారని, గ్రామ స్థాయిలో నిర్ధారణ చేయాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు స్పోర్ట్స్ : ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని గన్నవరం రైల్వే స్టేషన్‌లో విద్యుదాఘాతానికి గురైన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం రాత్రి మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో గన్నవరం రైల్వే స్టేషన్ ఆవరణలో ఈనెల 19వ తేదీన గుర్తుతెలియని వ్యక్తి విద్యుత్ ఘాతానికి గురయ్యాడు. గన్నవరం టికెట్ బుకింగ్ కౌంటర్‌లో పనిచేస్తున్న సిబ్బంది అతన్ని గుర్తించి వెంటనే చికిత్స నిమిత్తం విజయవాడ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను గురువారం రాత్రి మృతిచెందాడు. దీంతో ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ శివన్నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతను హిందీ మాట్లాడుతున్నాడని, తెలుగు సరిగా అర్థం కావట్లేదని, వివరాలు ఏమీ తెలుపలేదని ఆయన తెలిపారు. ఇతని వివరాలు తెలిసినవారు ఏలూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆయన సూచించారు.

యువకుడు అదృశ్యం

ఏలూరు స్పోర్ట్స్ : బైక్ షోరూంలో పనిచేయడానికి వెళుతున్నానని ఇంటి నుండి బయలుదేరిన యువకుడు అదృశ్యమయ్యాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదపాడు మండలం దాసరి గూడెం గ్రామానికి చెందిన సొంటి శేషు ఈనెల 10న ఇంటి నుండి ఏలూరు సత్రంపాడులోని బైక్ మెకానిక్ షో రూమ్‌లో హెల్పర్ గా పనిచేయడానికి వచ్చాడు. మరలా తిరిగి ఇంటికి వెళ్లలేదు. పలు ప్రాంతాల్లో వెతికిన ఫలితం లేదు. దీంతో త్రీ టౌన్ పోలీసులకు శుక్రవారం రాత్రి అతని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా విక్రేత అరెస్టు

చింతలపూడి : అక్రమంగా సారా అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు చింతలపూడి ఎక్సైజ్ సిఐ పి.అశోక్ కుమార్ తెలిపారు. చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెంలో సారా అమ్ముతున్న మహిళలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా గత సారా కేసుల్లో ఇద్దరు మహిళలపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

చెత్త కుప్పలతో తీవ్ర ప్రమాదం..!

- ప్లాస్టిక్ వ్యర్థాలను మింగేస్తున్న మూగజీవాలు
- మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదంటూ స్థానికుల ఆరోపణ
- తొలగించాలని వేడుకోలు


రోడ్డు మీద పేరుకుపోయిన చెత్తకుప్పల వద్ద ఉన్న మూగ జీవాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని మైలవరం రోడ్డులో గల పశువుల ఆసుపత్రి వద్ద చెత్త కుప్పలు పేరుకుపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని సమీపంలోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో చెత్తకుప్పలు తొలగించకపోవడం వల్ల మూగజీవాలు మేత కోసం వస్తున్నాయి. చెత్త కుప్పల్లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులలోని ఆహారంతో పాటు మింగేస్తున్నాయి. వీటివల్ల మూగజీవాలకు తీవ్ర ప్రమాదం సంభవిస్తోంది. ఎన్నో సార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదంటూ స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా చెత్తకుప్పలను తొలగించకపోతే తీవ్ర దుర్గంధం వల్ల అనారోగ్యాలు సంభవిస్తాయని స్థానికులు తెలిపారు. మూగజీవాలను రోడ్లపై సంచరించకుండా కట్టడి చేయాలని కోరుతున్నారు.

పలుచోట్ల ప్రపంచ పోలియో దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ


దెందులూరులో..



జంగారెడ్డిగూడెంలో..

ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా ఏలూరులోని గూడ్స్ షెడ్ రోడ్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి యు.శోభ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శోభ పోలియో వ్యాక్సిన్ ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 24న ప్రపంచ పోలియో దినోత్సవం జరుపుకుంటామని, దీని ప్రధాన ఉద్దేశ్యం పోలియో వ్యాధి నాశనం కోసం ప్రజలు అవగాహన సృష్టించడం, ప్రతి చిన్నారిని పోలియో వ్యాధి నుండి కాపాడడంలో టీకాల ప్రాముఖ్యత ప్రచారం చేయడమని అన్నారు. పోలియో అనేది ఒక తీవ్రమైన సంక్రమించగల వైరల్ వ్యాధి అని, ఇది ఐదు సంవత్సరాల పిల్లలను ప్రభావితం చేస్తుందన్నారు. ఈ వ్యాధి కారణంగా శరీర భాగాలు పక్షవాతం వచ్చే ప్రమాదం ఉంది కాబట్టి టీకాల ద్వారా ఈ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. భారతదేశం 2014వ సంవత్సరంలో పోలియో రహిత దేశంగా ప్రకటించబడిందని తెలిపారు. ప్రతి సంవత్సరం ఈరోజున లెట్స్ జాయిన్ హాండ్స్ టు ఎండ్ పోలియో నౌ అండ్ ఫరెవర్, ఎండ్ పోలియో ఎవ్రీ చైల్డ్, ఎవ్రీ వ్యాక్సిన్, ఎవ్రీ వేర్ అనే సూక్తి నేపథ్యంతో పాటించబడుతుందని, ప్రతి ఐదు సంవత్సరాలకు పోలియో డ్రాప్స్ ఇవ్వాలని తెలిపారు. టీకాలను ప్రతి గ్రామ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి బుధవారం, శనివారం ఇస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, వైద్యాధికారులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా శుక్రవారం జంగారెడ్డిగూడెం రోటరీ క్లబ్ తరపున ప్రెసిడెంట్ పెనుమర్తి సురేష్ బాబు, సెక్రెటరీ సంధ్య ప్రవల్లిక ఆధ్వర్యాన రోటరీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ ఈ పోలియో నివారణలో భాగస్వాములు కావాలని, ప్రపంచంలో పోలియో లేకుండా నివారించడమే రోటరీ ధ్యేయమన్నారు. ఈ ర్యాలీలో తపస్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ బుద్ధాల సురేష్, రోటరీ సభ్యులందరూ పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు. రోటరీ సభ్యురాలు నరం రేణుక ఆధ్వర్యాన మెడికల్ టీం ఎఎన్ఎంలు, ఆశా వర్కర్స్, జంగారెడ్డిగూడెం పోలీస్ శాఖ పాల్గొన్నారు.

దెందులూరు : దెందులూరు బిఆర్అండ్‌డి స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో ప్రపంచ పోలియో దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జె.సిరి మాట్లాడుతూ పోలియో వ్యాక్సిన్ అభివృద్ధి చేసిన డాక్టర్ జోనాస్ సాల్క్ పుట్టినరోజును పురస్కరించుకొని ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థులు మానవహారంగా నిలబడి పోలియోపై అవగాహన ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారమివ్వాలి

సిపిఎం జిల్లా కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి

ఏలూరు అర్బన్ : హైదరాబాద్ నుండి బెంగళూరు వెళుతున్న ప్రయివేట్ బస్సు కర్నూల్ వద్ద అగ్ని ప్రమాదానికి గురై ఇద్దరు చిన్నారులతో సహా దాదాపు 20 మంది మరణించడం పట్ల సిపిఎం జిల్లా కమిటీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేస్తూ ఈ ఘటనలో మరణించిన వారికి ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గాయపడిన వారికి అత్యవసర చికిత్స అందించి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బస్సులు నిర్వహించే ప్రయివేటు యాజమాన్యాలు ప్రమాదాలు జరగకుండా తగిన రక్షణ చర్యలు పాటించడం లేదని తెలిపారు. లాభాపేక్షతో ప్రయాణికుల నుండి పండుగలు, ఇతర రద్దీ సమయాల్లో అత్యధిక మొత్తంలో డబ్బులు వసూలు చేయడానికి చూపించిన శ్రద్ధని బస్సుల మెయింటినెన్స్‌కు చూపించడం లేదని విమర్శించారు. హైవేలలో ప్రమాదాల నివారణకు ప్రభుత్వాలు కూడా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

కర్నూలు వద్ద జరిగిన కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో చనిపోయిన మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చక్రాల అమర్ కుమార్, జె.గోపి డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒరిస్సా రాష్ట్రంలో కేవలం 43 సీటింగ్ పర్మిషన్ తీసుకొని, స్లీపర్ కోచ్‌గా మార్చి అక్రమాలకు పాల్పడిన కావేరి ట్రావెల్స్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అమరావతి నిర్మాణానికి ముస్లింల విరాళం


సన్మానిస్తున్న డాక్టర్ మనోజ్

ముదినేపల్లి : అమరావతి నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ముదినేపల్లికి చెందిన ప్రముఖ వైద్యులు అంబుల మనోజ్ అన్నారు. శుక్రవారం ముదినేపల్లిలోని మసీదులో అమరావతికి జీవం పోద్దాం.. రూ.116 సాయం చేద్దాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది ముస్లిం సోదరులు రూ.116 విరాళాలను ఎపిసిఆర్‌డిఎ బ్యాంకు ఖాతాకు క్యూఆర్ కోడ్ ద్వారా పంపించారు. అనంతరం విరాళాలు సిఆర్‌డిఎ ఖాతాకు పంపించిన ముస్లిం సోదరులకు డాక్టర్ మనోజ్ శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించారు.

నీట మునిగిన బంక్ కాలనీ వాసులకు పునరావాసం

ప్రజాశక్తి - కలిదిండి

వరుస వర్షాలతో మండలంలోని పడమటిపాలెం పంచాయితీ పరిధిలోని బంకు కాలనీలో నివసించే వారి ఇళ్ల చుట్టూ నీరు చేరి దిక్కుతోచని పరిస్థితిలో ఉండిపోయారు. వరుసగా రెండు రోజులు కాలనీవాసుల గురించి ప్రజాశక్తిలో వార్తలు వెలువడిన విషయం పాఠకులకు విధితమే. దీంతో రెవెన్యూ అధికారులు వారిని గుర్తించి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 15 కుటుంబాల వారికి పునరావాసం కల్పించారు. భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. స్థానిక నాయకులు వారి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థులకు మండల స్థాయి పోటీలు

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ బాయ్స్ హై స్కూల్‌లో శుక్రవారం రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవ మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేసి ఆ ఆరుగురు విద్యార్థులకు కూడా క్విజ్ నిర్వహించి, వారిలో ముగ్గురు విద్యార్థులను ఈ పోటీలలో విజేతలుగా నిర్ణయించారు. ఈ ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు వెళ్తారని మండల ఎంఇఒ-1 ప్రసాద్, ఉపాధ్యాయులు డి.శ్రీనివాసరావు తెలిపారు. నూజివీడు మండల రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవ విజేతలుగా ఎ.దీపిక పదవ తరగతి, జెడ్‌పి హైస్కూల్ యనమదల, బి.అర్చన ఎనిమిదవ తరగతి జెడ్‌పి హైస్కూల్ బాయ్స్ నూజివీడు, ఎం.శ్రీ లాస్య పదవ తరగతి జెడ్‌పి హైస్కూల్ గర్ల్స్ విజేతలుగా ప్రకటించారు. మండల స్థాయిలో జరిగినటువంటి పోటీలలో దాదాపుగా మండలంలో ఉన్నటువంటి అన్ని యుపి స్కూల్స్ ఉన్నత పాఠశాలల విద్యార్థులందరూ పోటీ పడ్డారు.

ముసునూరు : రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థుల్లో రాజ్యాంగ విలువలు, పౌర సంబంధాల అవగాహన, ప్రజాస్వామ్య నైపుణ్యాలను ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలని మండల విద్యాశాఖ అధికారి బివిఎస్.సుబ్బారావు అన్నారు. మండలంలోని ఉన్నత పాఠశాలల్లో ఈనెల 22వ తేదీన పాఠశాల స్థాయిలో వ్యాసరచన, డిబేటింగ్, క్విజ్ పోటీలు నిర్వహించగా ప్రతి పాఠశాల నుండి ఎంపికైన ముగ్గురు విద్యార్థులతో మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గురు విద్యార్థులను నియోజకవర్గ స్థాయి పోటీలకు(ఈనెల 29 లేదా 30 తేదీల్లో) నూజివీడులో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు డి.శైలజ, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు, అన్ని పాఠశాలల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


హాజరైన విద్యార్థులు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి : ఎఎస్‌పి

ఏలూరు స్పోర్ట్స్ : సైబర్ నేరాల వల్ల మోసపోయిన వారిలో ఎక్కువగా యువత ఉంటున్నారని, ఖచ్చితంగా యువత సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎఎస్‌పి నక్క సూర్యచంద్రరావు తెలిపారు. ఏలూరు నగరంలోని రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎఎస్‌పి, సిఐడి డిఎస్‌పి డాక్టర్ రవికిరణ్‌లు ప్రత్యేక అతిథులుగా పాల్గొని విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ డిజిటల్ అరెస్ట్ పేరుతో ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఈ డిజిటల్ అరెస్ట్ ప్రక్రియలో భాగంగా గుర్తుతెలియని పోలీసులు అధికారి యూనిఫామ్ వేసుకుని వీడియో కాల్ చేస్తారని, మీపై అరెస్ట్ వారెంట్ వచ్చిందని వెంటనే మిమ్మల్ని అరెస్టు చేసేందుకు వస్తున్నామని వీడియో కాల్‌లో తెలుపుతున్నారని, దీంతో భయపడిన వ్యక్తులు, విద్యార్థులు, మహిళలు వీరంతా వారికి తమ ఖాతాలో ఉన్న సొమ్ములను చెల్లిస్తున్నారని తెలిపారు. ఈవిధంగా ఎవరైనా సైబర్ నేరానికి పాల్పడుతున్నట్లు తెలిసిన, సైబర్ నేరం జరిగినా వెంటనే సైబర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, తద్వారానే సైబర్ నేరాల పాలిట పడకుండా ఉంటామని ఏలూరు ఒకటో పట్టణ ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. ఒకటో పట్టణ పరిధిలో అంజిమన్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఏలూరు నగరంలోని అకౌంట్ హోల్డర్లకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పలువురు అకౌంట్ హోల్డర్లు పాల్గొన్నారు.

డాక్టర్ అభిమన్యుడు గొప్ప సామాజిక వేత్త

వర్ధంతి కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి - పోలవరం


అతిథులను సత్కరిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

విద్యతో జీవితం మారుతుందని, విద్య అనేది మనిషి జీవితానికి దిక్సూచి వంటిదని, అభిమన్యు జీవితం అందుకు ఆదర్శమని శాప్ డైరెక్టర్ కోవాసు జగదీశ్వరి అన్నారు. ప్రఖ్యాత విద్యావేత్త, సేవా భావి, సామాజిక కార్యకర్త డాక్టర్ అభిమన్యుడు 18వ వర్ధంతిని ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు, గ్రామస్తులు పట్టిసీమ గ్రామంలో ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ అభిమన్యుడు దాకే ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, ఆయన సతీమణి దాకే స్వర్ణలత ఆధ్వర్యాన కుమారుడు దాకే సుధీర్ బాబు సమన్వయంతో నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర క్రీడా సంస్థ ఆథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ కోవాసు జగదీశ్వరి, మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, పట్టిసీమ సర్పంచి సబ్బారపు శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి సభ్యురాలు కలుం హేమకుమారి, దళిత నాయకులు సొబ్బన మోహన్, రాపాక ప్రసంగి రాజు, సమాజ సేవకులు కొణతాల ప్రసాద్, నూనకాని రాంబాబు, వైసిపి మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, వైసిపి మహిళా నాయకురాలు మున్ని, ప్రొఫెసర్ డాక్టర్ బీరా విజయబాబు, ఇతరులు ప్రధాన అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమం కల్యాణ మండప ప్రాంగణంలో జ్యోతి ప్రజ్వలన చేసి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వేడుకలు ప్రారంభించారు. అనంతరం డాక్టర్ అభిమన్యుడు విగ్రహం వద్ద పూలమాలలు వేసి ఘనమైన నివాళి అర్పించారు. అంబేద్కర్ ఆశయాలను పాటిస్తూ విద్య, సమానత్వం, సేవ అనే విలువలను ప్రాధాన్యంగా తీసుకొని సమాజ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషిని ముఖ్య అతిథులు వివరించారు. ఈ సందర్భంగా శాప్ డైరెక్టర్ కోవాసు జగదీశ్వరి మాట్లాడుతూ పేద, ధనిక తేడా లేకుండా ఎవరు పట్టుదలతో ప్రయత్నిస్తే వారు తప్పకుండా విజయాన్ని సాధించగలరని అన్నారు. విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇచ్చి పిల్లల్లో దేహదారుఢ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, క్రీడల విభాగాలకు ప్రత్యేక పథకాలు అమలు చేస్తోందని ఆమె తెలిపారు. మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు మాట్లాడుతూ డాక్టర్ అభిమన్యుడు ఒక చిన్న గ్రామంలో జన్మించి ఉన్నత విద్యను అభ్యసించి సేవామార్గంలో విశిష్ట స్థానం సంపాదించారని పేర్కొన్నారు. ఆయన సేవా భావం, సామాజిక దృక్పథం ప్రేరణతోనే దాకే ఫౌండేషన్ ఎంతోమంది పేద, వెనుకబడిన తరగతుల వారికి అండగా నిలుస్తోందని చెప్పారు. తండ్రి ఆశయాలను ఆచరిస్తూ సేవా మార్గంలో ముందుకు సాగుతున్న సుధీర్ బాబును అభినందించారు. అభిమన్యుడు 18వ వర్ధంతి సందర్భంగా పేద ప్రజలకు వస్త్రాలు పంపిణీ చేయడం, విద్యార్థులకు క్రీడా సామాగ్రి అందజేయడం, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారికి దాకే ఫౌండేషన్ ద్వారా సహాయం చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. గ్రామ ప్రజలు ఈ సేవా కార్యక్రమాలను హర్షిస్తూ ఫౌండేషన్ కార్యకలాపాలను ప్రశంసించారు. ఈ సందర్భంగా దాకే స్వర్ణలత, సుధీర్ బాబు, అతిథులకు శాలువాలు కప్పి, ఫౌండేషన్ జ్ఞాపికలు బహుకరించి సత్కరించారు. అనంతరం పట్టిసీమలో భారీ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని స్మృతివేదిక వద్ద నివాళులు అర్పించారు. గ్రామస్తులు మాట్లాడుతూ డాక్టర్ అభిమన్యుడు పట్టిసీమకు గర్వకారణమని, అటువంటి వ్యక్తి వర్ధంతి గ్రామంలోనే జరగడం తమ అదృష్టమన్నారు. ఆయన సేవా తపనను సుధీర్ బాబు కొనసాగిస్తున్న తీరు యువతకు ఆదర్శమని తెలిపారు.

'కాంగ్రెస్ బలోపేతానికి కృషి'

చింతలపూడి : కాంగ్రెస్ బలోపేతానికి అందరూ కృషి చేయాలని ఎపిపిసిసి సభ్యులు, నియోజకవర్గ కన్వీనర్ ఎలిజా అన్నారు. మండలంలో శుక్రవారం కాంగ్రెస్ కార్యాలయం వద్ద చింతలపూడి నియోజకవర్గం నాలుగు మండలాల అధ్యక్షులను నియమించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షులుగా జగ్గవరపు పెదకోటి రెడ్డిని కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ ఎలిజా నియమించారు. ఈ సందర్భంగా పదవులు వచ్చిన వారిని బాధ్యతగా పార్టీని బలోపేతానికి కృషి చేయాలని కోరారు. 2029 ఎన్నికలకి అందరూ సిద్ధంగా ఉండాలని కోరారు.

ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ

ముదినేపల్లి: కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ చేయటంపై వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం - రచ్చబండ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రజా ఉద్యమం- రచ్చబండ పోస్టర్‌ను మాజీ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు మండలంలోని చిగురుకోటలో ఆవిష్కరించారు. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 28వ తేదీ నియోజకవర్గ కేంద్రం కైకలూరులో జరిగే 'ప్రజా ఉద్యమం' కార్యక్రమానికి నాలుగు మండలాల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలని డిఎన్ఆర్ కోరారు. ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షులు బోయిన రామరాజు, రాష్ట్ర ముదిరాజ్ సంఘ అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్, రాష్ట్ర మహిళా విభాగ కార్యదర్శి గంటా సంధ్య పాల్గొన్నారు.